
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
18-3-2026 (Wednesday)
MAIN EDITION

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ లేదు: ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజకీయాల్లో ఫుల్ స్టాప్ లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పదవీ కాలం ముగి సిన రాజ్యసభ సభ్యులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలబెట్టడంలో సెకండ్ ఓపినియన్‌కు కీలకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. సభలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం హాస్యం, వ్యంగ్యం కూడా అవసరమన్నారు. రాందాస్ అథవాలే అరుదైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన మాట తీరు విలక్షణంగా ఉంటుందన్నారు.

## కరీంనగర్‌లో విషాదం.. ఎస్సై భార్య సూసైడ్

**అక్షరటుడే, కరీంనగర్:** కరీంనగర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఓ ఎస్సై భార్య ఆత్మహత్యకు పాల్పడింది. కరీంనగర్ టూ టౌన్లో ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్ భార్య సూసైడ్ చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ భార్య దివ్య కరీంనగర్‌లోని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. గన్నేరు పప్పు దంచుకుని తాగడంతో కుటుంబ సభ్యులు ఆమెను మంగళవారం ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఎస్సై దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. దివ్య కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సులో ప్రయాణించిన చంద్రబాబు

**అక్షరటుడే, ఏపీ:** 'దివ్యాంగ శక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం లభించనుంది. ప్రారంభోత్సవంలో భాగంగా మంగళగిరి నుంచి పెనుమాక వరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్.. దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు.



## ఎన్ఐఏ అదుపులో అమెరికన్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా కిరాయి సైనికుడు మాథ్యూ వాన్‌డైకె భారత్‌లో అరెస్టయ్యాడు. అతడితో పాటు మరో ఆరుగురు ఉక్రెయిన్ జాతీయులు ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులో ఉన్నారు. వీరు పర్యాటక వీసాపై దేశంలోకి అక్రమంగా ప్రవేశించి, భారత్ వ్యతిరేక సంస్థలతో పనిచేస్తున్నారని ఎన్ఐఏ వెల్లడించింది.




## దేశంలో ఎల్‌పీజీ కొరత లేదు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో ఎల్‌పీజీ కొరత లేదని కేంద్ర తెలిపింది. దేశీయంగా 40 శాతం గ్యాస్ ఉత్పత్తిని పెంచినట్లు పేర్కొంది. హార్ముజ్ జలసంధిని దాటిని భారత్ తీరాన్ని చేరుకున్న ఎల్‌పీజీ నౌకలు నందాదేవి, శివాలిక్ నుంచి అన్ లోడింగ్ జరుగుతోందని వెల్లడించింది. హార్ము జ్ దగ్గరున్న 22 ట్యాంకర్లు సేఫ్‌గా ఉన్నాయని స్పష్టం చేసింది.





## అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్ ఇచ్చింది. స్వచ్ఛందంగా దేశం వదిలివెళ్లే అక్రమ వలసదారులకు 2,600 డాలర్లు ఎగ్జిట్ బోనస్ ఇవ్వనున్నట్లు ట్రంప్ యంత్రాంగం వెల్లడించింది. అంతేకాకుండా వారి స్వదేశాలకు విమానంలో ఉచితంగా పంపించడానికి ఏర్పాట్లు సైతం చేస్తామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది. అక్రమ వలసదారులు తాము స్వదేశానికి తిరిగివెళ్లేందుకు సిద్ధమేనని 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరింది. ఇలా నమోదు చేసుకున్న వారి పేర్లను బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన వారి లిస్టు నుంచి తొలగిస్తామని పేర్కొంది.

## మూడువేల కిలోల కల్తీ పన్నీరు సీజ్

**అక్షరటుడే, హైదరాబాద్ :** సికింద్రాబాద్ లోని మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా కల్తీ పన్నీరును ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఒక తయారీ కేంద్రంపై అకస్మాత్తుగా దాడులు నిర్వహించిన పోలీసులు.. సుమారు మూడు వేల కిలోల కల్తీ పన్నీరును స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ ముఠాపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ వెల్లడించింది.



# మూసీపై అసెంబ్లీలో రగడ

**మూసీ ప్రాజెక్ట్‌పై అసెంబ్లీలో వాడివేడీగా చర్చ సాగింది. అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చ జరిగింది. మూసీ డీపీఆర్ సిద్ధం అయిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నది సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, మూసీ పేరిట దోపిడీ వ్యతిరేకమని కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **డీపీఆర్ సిద్ధం అయిందన్న మంత్రి శ్రీధర్‌బాబు**
- **మూసీ పేరిట దోపిడీకి వ్యతిరేకం : కేటీఆర్**
- **సభ నుంచి వాకౌట్ చేసిన బీఆర్ఎస్**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు సభలో మాట్లాడారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. మూసీ ప్రాజెక్ట్ తొలి దశ డీపీఆర్ సిద్ధం అయిందని చెప్పారు. అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని, పునరావాస కార్యక్రమాలు చేపడుతామన్నారు.

### డీపీఆర్‌ను సభలో పెట్టాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తాము మూసీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకం కాదన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో చెప్పారన్నారు. ఇప్పుడు రెండు నెలల్లో ఎలా తయారు చేశారని ప్రశ్నించారు. మూసీ డీపీఆర్‌ను సభలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రూ.16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్ట్‌ను రూ.లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మూసీ సుందరీకరణలో ఎన్ని దశలు ఉంటాయని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్‌కు తాము వ్యతిరేకం కాదని కేటీఆర్ అన్నారు. అయితే ప్రాజెక్ట్ పేరిట దోపిడీని మాత్రం వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

### ఎన్ని ఇళ్లు కూలుస్తారు..

మూసీ ప్రాజెక్ట్‌లో 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని మంత్రి చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. అయితే గెజిట్ లో మాత్రం 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. వీటిలో ఎది కరెక్ట్ అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేసింది. ప్రభుత్వం దగ్గర నిధులు లేవని, ప్రణాళికలు లేదన్నారు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీని వ్యతిరేకిస్తూ.. వాకౌట్ చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు.

### చర్చకు సిద్ధం

వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చారని కేటీఆర్ అన్నారు. దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించారు. వెలుగుమట్లపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. అసలు విషయాలు అన్ని తెలిస్తే.. కేటీఆర్ అసెంబ్లీలో కూర్చోవడానికి కూడా సిగ్గుపడాల్సిన పరిస్థితి వస్తుందని మంత్రి అన్నారు.

## 2029లో అసెంబ్లీ ఎన్నికలు : రేవంత్‌రెడ్డి




**అక్షరటుడే, ఢిల్లీ :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు 2029లో వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 2023 నవంబర్‌లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ లెక్కన 2028 నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు జరగాలి. సీఎం మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో ఉండాలని, కానీ మరో నాలుగు, ఐదు నెలలు ఆలస్యంగా డిసెంబర్‌లో వస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అవుతోందని ఆయన పేర్కొన్నారు. దీంతో 2029లో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సైతం పార్లమెంట్ ఎన్నికలతో పాటు 2029లో జరిగే అవకాశం ఉందన్నారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్నారు : కోమటిరెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** పీసీసీ చీఫ్‌పై తాను చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. తాను మహేష్ కుమార్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. జగ్గారెడ్డి పీసీసీ అధ్యక్షుడు అయితే అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలు గెలుస్తామన్నారు. దీంతో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మార్చాలని ఆయన వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరిగింది. దీంతో మంత్రి స్పందించారు. మహేశ్‌గౌడ్ సారథ్యంలో.. గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. రంజాన్ వేడుకలకు జగ్గారెడ్డి ఏర్పాట్లు బాగుండటంతో పీసీసీ చీఫ్ అయితే బాగుంటుందని అన్నట్లు చెప్పారు. ఇప్పుడున్న పీసీసీని తొలగించాలనేది తన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. తనపై ఉద్దేశ పూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఢిల్లీలో అగ్నిప్రమాదం.. 9 మంది మృతి

**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ పాలం ప్రాంతంలోని సాధ్ నగర్‌లో ఒక నివాస భవనంలో మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదంలో ముగ్గురు చిన్నారులతో సహా కనీసం తొమ్మిది మంది మరణించారని అధికారులు తెలిపారు. భవనం నుంచి దూకిన ఇద్దరు ఆస్పత్రిలో మరణించడంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరిందని డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ ఎస్.కె.దువా తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని కాస్మెటిక్ షాపులో మండే స్వభావం గల వస్తువులు ఉండడంతో మంటలు వ్యాపించాయన్నారు. 30 ఫైర్ ఇంజిన్‌లతో మంటలను ఆర్పివేశారు.

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి కీలక ప్రకటన.. రెండో విడతలో వారికి అవకాశం



**అక్షరటుడే, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ పథకం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఏప్రిల్-మే నెలల్లో రెండో విడుత ప్రారంభిస్తామన్నారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతి ఏటా అమలు చేసే ఒక నిరంతర ప్రక్రియ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డులో ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తామని ప్రకటించారు. గృహనిర్మాణ పథకంపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రెండో దశ లబ్ధిదారుల ఎంపికను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

## వన్డే ర్యాంకింగ్స్ విడుదల

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే ర్యాంకింగ్స్ విడుదల చేసింది. టాప్‌లో భారత్ నుంచి ముగ్గురు ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. బ్యాటింగ్‌లో రెండో స్థానంలో కోహ్లీ, నాలుగో స్థానంలో రోహిత్, అయిదో స్థానంలో గిల్ ఉన్నారు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్ యాదవ్ 8వ స్థానంలో ఉన్నారు. బ్యాటింగ్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్, బౌలింగ్‌లో అఫ్గన్ ఆటగాడు రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

## చైనాకు వెళ్లాల్సిన రష్యన్ ఆయిల్ ట్యాంకర్ భారత్‌కు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ అమెరికా యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. యూఎస్ దాడులను నిరసిస్తూ ఇరాన్ హోర్ముజ్ జలసంధిని బ్లాక్ చేసింది. దీంతో గ్యాస్ చమురు సరఫరాకు ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు కొనుగోలుపై విధించిన పలు ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించింది. దీంతో రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ ఇటీవలి కాలంలో మళ్లీ పెంచింది. ఈ క్రమంలో దక్షిణ చైనా సముద్ర జలాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. రష్యాకు చెందిన ఆక్వా టైటాన్ అనే చమురు వాహక నౌక భారత్ వైపు మళ్లినట్లు తెలుస్తోంది. భారత్ అవసరాల దృష్ట్యా.. రష్యా మన దేశానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## రాకాసా' బిజినెస్.. ఈసారి కూడా నిహారికకు లాభాలు



**ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న 'రాకాసా' సినిమాపై రిలీజ్‌కు ముందే అంచనాలు ఏర్పడ్డాయి. వాటికి తగ్గట్టే సాలిడ్ బిజినెస్ చేసుకుంటోంది. ఈ సినిమా థియేట్రికల్ రైట్స్‌కు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన 'రాకాసా' థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ సంస్థ శ్రీ లక్ష్మి నరసింహ మూవీ మేకర్స్ భారీ రేటుకు దక్కించుకుంది. లోకల్ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ 'రాకాసా'ను భారీ లెవెల్‌లో లాంచ్ చేస్తున్నారు. వరల్డ్ వైడ్‌గా 2026, ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాకముందే, ఏప్రిల్ 2న విదేశాల్లో ఈ సినిమా ప్రీమియర్లు భారీ స్థాయిలో వేయనున్నట్లు తెలుస్తోంది. రిలీజ్‌కు ముందే డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను ఇంత బలంగా రెడీ చేసుకోవడం చూస్తుంటే.. ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపించడం ఖాయంగా కనిపిస్తోంది.అలాగే నిర్మాత నిహారిక కొణిదెల 'కమిటీ కుర్రోళ్లు' తర్వాత ఈ సినిమాకు కూడా టేబుల్ ప్రాఫిట్స్ అందుకోబోతున్నారు అని స్పష్టమవుతోంది.**

- అక్షరటుడే, సినిమా డెస్క్